www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 20 | ఏప్రిల్ | 2026 పేజీలు : 8

## ఎంఎల్ఏ కూనంనేనికి వినతుల వెల్లువ



2 లో

# సబ్బండ వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్







ప్రజాపక్షం/ ఖమ్మం : కాంగ్రెస్ పార్టీ రైతులు, కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత, మహిళలు సహా సబ్బండ వర్గాలను మోసం చేసిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకులు తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేకపోతున్నారని ఆయన తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రుల మధ్య సక్యత లేదని వారు ఏనాడు జిల్లా అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడలేదని ఆయన మిగతా 2లో..

- -ముగ్గురు మంత్రుల మధ్య సక్యత కరువు
- -సంక్షేమం, అభివృద్ధికి తిలోదకాలు
- -మాజీ మంత్రి హరీష్‌రావు
- -కాంగ్రెస్ పతనానికి ఖమ్మం నాంది పలకాలి
- - మాజీ మంత్రి అజయ్ కుమార్
- -ఘనంగా బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

## దశ మారుతున్న దక్షిణ అయోధ్య



- -మారుతున్న భద్రాద్రి రూపరేఖలు
- - ప్రధాన ఆలయం మినహా అన్ని రకాల మార్పులు
- - 26న ప్రత్యేక పూజలు
- - పుష్కరాల నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు

ప్రజాపక్షం/భద్రాచలం : దక్షిణ అయోధ్య దశను మార్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. యాదాద్రిని మించి భద్రాద్రిని తీర్చిదుద్దుతామని రామ భక్తులకు మాటిచ్చిన సర్కార్ ఆ దిశగా అడుగులేస్తోంది. శ్రీరామ నవమి సందర్భంగా సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 371 కోట్ల నిధుల తొలిదశ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని గత నాలుగు రోజుల క్రితం మంత్రి శ్రీనివాసరెడ్డి ఆలయ ప్రాంగణాన్ని మిగతా 2లో..

## ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు



- - సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం
- - అట్టహాసంగా దారేడు, పడమటితండా, కామంచికల్‌శాఖ మహాసభలు

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. ఆదివారం ఖమ్మంరూరల్ మండలంలోని కామంచికల్, పడమటితండా, దారేడులలో సీపీఐ శాఖ మహాసభలను నిర్వహించారు. తొలుత ఏర్పాటు చేసిన అరుణపతాకాలను సీపీఐ సీనియర్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భాగం మాట్లాడుతూ...ఇతర రాజకీయ పార్టీలకు ప్రజా సమస్యలపై పోరాడే తత్వం లేదని విమర్శించారు. పేదల కష్టాలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం గళమెత్తే ఏకైక శక్తి ఎర్రజెండానే మిగతా 2లో..

# సబ్బండ వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)



తెలిపారు. ఆదివారం స్థానిక మమత మెడికల్ కళాశాల మైదానంలో బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదిన సందర్భంగా ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఖమ్మం నగర బిఆర్ఎస్ అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో హరీష్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ లేదని రెండు లక్షల ఉద్యోగాలంటూ కేవలం 16వేల ఉద్యోగాలు మాత్రమే కల్పించారని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేదని, రిటైర్ ఉద్యోగులు నిరహార దీక్షలు చేస్తున్నారని, రైతులు, మహిళలు, దళితులను, గిరిజనులను మోసం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా మక్కలు పండించే ఖమ్మంజిల్లాలో మక్కలు కొనుగోలు చేయక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. వడ్లు కొనే నాథుడు కనిపించడం లేదని చాలా ప్రాంతాల్లో మిల్లర్లు తరుగు పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారని హరీష్‌రావు తెలిపారు. శాసనసభలో తుమ్మల నాగేశ్వరరావు రుణమాఫీ పూర్తి అయిందని ప్రకటించారని సిద్దిపేటలో కానీ రఘునాథపాలెంలో కానీ తాను రైతుల సమక్షంలో తేల్చుకునేందుకు సిద్దంగా ఉన్నానని పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగితే రాజీనామా చేయడానికి నేను సిద్ధమని తుమ్మల సిద్ధమా అని ఆయన ప్రశ్నించారు. రైతు బంధు రూ.20వేల కోట్లు రైతులకు ఎగవేశారని హరీష్‌రావు తెలిపారు. జిల్లాకు చెందిన మరో మంత్రి భూ బకాసురుని అవతారం ఎత్తారని ఆయన క్రషర్లు, మైన్స్ కబ్జా చేసే పనిలో ఉన్నారని హరీష్‌రావు ఆరోపించారు. ఇక్కడ దోపిడీ చేసి ఢిల్లీలో కప్పం కడుతున్నారని పొంగులేటి విషయంలో దొంగను దొరకబట్టామని ముఖ్యమంత్రి చెబుతుంటే పొంగులేటి మాత్రం ముఖం చాటేస్తున్నారని ఆయన తెలిపారు. ఎస్సి డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీ ఏమైందని గతంలో బిఆర్ఎస్ అమలు చేసిన దళిత బంధు స్థానంలో రూ. 12 లక్షలు ఇస్తామని చెప్పి ఎందుకు ఎగవేశారని ఆయన ప్రశ్నించారు. ఎస్సి, ఎస్టిలకు సబ్‌ప్లాన్ క్రింద కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయడం లేదని హరీష్‌రావు తెలిపారు. రేవంత్‌రెడ్డి ఆంధ్రాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ నిర్మించ తలపెట్టిన గోదావరి నల్లమల సాగర్‌కు నీటిని అందించేందుకే మేడిగడ్డ, సీతమ్మ సాగర్ గురించి పట్టించుకోవడం లేదని హరీష్‌రావు తెలిపారు. ఏపి కుట్రలో రేవంత్ భాగస్వామ్యుడిగా మారుతున్నారన్నారు. ముగ్గురు మంత్రులు ఉన్న ఖమ్మం జిల్లాకు ఉపయోగం లేదని భట్టి విక్రమార్క సొంత నియోజక వర్గంలోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రం మొత్తం ఇప్పుడు ఒక నినాదం మారుమ్రోగుతుందని అదే రేవంత్ పోవాలి కేసిఆర్ రావాలి అనే నినాదమని హరీష్‌రావు తెలిపారు. ఖమ్మం జిల్లాలో వెలుగుమట్ల విషయంలో విధి నిర్వహణలో ఉన్న పోలీసులు కన్నీరు కార్చినా మంత్రులకు మాత్రం గుండె కరగలేదన్నారు. 800 ఇండ్లు కూల్చి 300 మందికి పట్టాలిస్తే అందులో సగం మంది కాంగ్రెస్ వారే ఉన్నారని హరీష్‌రావు తెలిపారు. ఖమ్మం జిల్లాకు మెడికల్ కళాశాలతో పాటు అన్ని రకాలుగా అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్‌కు కేసిఆర్‌కు దక్కుతుందని రేవంత్‌ను ఇంటికి పంపించేందుకు కార్యకర్తలు పని చేయాలన్నారు. చరిత్రను తిరగరాస్తూ పదికి పది స్థానాల్లో గెలిచేవిధంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ మంత్రి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాను సంక్షేమం, అభివృద్ధి విషయంలో కేసిఆర్, కేటిఆర్, హరీష్‌రావు సహకారంతో ఒక బంగారు తునకగా తయారు చేశామన్నారు. గతంలో కొంత మంది అసెంబ్లీ గేటు తాకనివ్వమని ప్రతిజ్ఞ చేశారని ఇప్పుడు వారికి కూడా అదే పరిస్థితి ఎదురవుతుందని అజయ్‌కుమార్ హెచ్చరించారు. పార్టీతో లబ్ది పొంది ఇష్టానుసారంగా మాట్లాడటం రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని తగు సమయంలో తగు రీతిలో స్పందిస్తారని అజయ్ కుమార్ తెలిపారు. ముగ్గురు మంత్రులు కాదు 30 మంది అయినా ఏమి చేయలేరన్నారు. కొంత మంది మొరుగుడుకు ప్రజలే సమాధానం చెబుతారని అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పతనానికి ఖమ్మం నుంచే అంకురార్పణ జరగాలన్నారు. బిఆర్ఎస్‌తో అనుబంధం దశాబ్ద కాలం పూర్తయిందని భవిష్యత్తులో కేసిఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసేందుకు కృషి చేస్తానని అదే తన లక్ష్యమని అజయ్‌కుమార్ ప్రకటించారు. ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామని రానున్న కార్పోరేషన్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.ఈ సభలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపి నామ నాగేశ్వర రావు, శాసన మండలి సభ్యులు తాతా మధు, సండ్ర వెంకటవీరయ్య తదితరులు ప్రసంగించగా మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ శాసన సభ్యులు మెచ్చా నాగేశ్వరరావు, కందాళ ఉపేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్‌జెసి కృష్ణ, గట్టు రాంచంద్రరావు, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# దశ మారుతున్న దక్షిణ అయోధ్య






పరిశీలించి నూతన నమూనా ప్రకారం శాస్త్రోక్తంగా పనులు రేయింబవళ్లు చేపట్టాలని ఆదేశించారు.

**ప్రధాన ఆలయం మినహా :**

భక్తరామదాసు నిర్మించిన గర్భగుడి, ప్రధాన ఆలయం మినహా ఆలయం రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఆ నిర్మాణాలను తొలగించి నూతనంగా స రికొత్త నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇప్పటికే చిత్రకూట మడపంలోని స్వామివారి ద్వాదశ వాహనాలను రంగనాయకుల గుట్టపైన ఉన్న ధ్యాన మందిరానికి తరలించారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలోని అన్ని ఉప ఆలయాలను, అళ్వార్లను ఆయా స్థానాల నుండి చలనం చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 26న ప్రత్యేక పూజలు చేస్తారు. మూల మూర్తులను కూడా ధ్యానమందిరానికి తరలించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. అక్కడే ఆరాధనలు జరగనున్నాయి.

**చిత్రకూట మండపం కూడా :**

ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికైన చిత్రకూట మండపం కూడా తొలగింపుకు గురికానుంది. 45 ఏళ్లపాటు అన్ని రకాల కార్యక్రమాలకు ఈ మండపం వేదికైంది. రామయ్య పెళ్లి పనులకు శ్రీకారం చుట్టేది ఇక్కడి నుండే, రామదాసు జయంతోత్సవాలతో పాటు పోకల దమ్మక్క, శబరి ఉత్సవాలతో పాటు పలు కార్యక్రమాలకు ఈ మండపం సేవలు అందించింది. 45 ఏళ్ల క్రితం అప్పటి దేశ ఉప ప్రధాని మురార్జీ దేశాయ్ 1967 జూలై 15న చిత్రకూట మండపానికి శంకుస్థాపన చేశారు. దీనిని 1982వ సం. ఏప్రిల్ 4న అప్పటి దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి పివి చౌదరి ప్రారంభించారు.

**పుష్కరాల నాటికి పనులు పూర్తయ్యేలా :**

చేపట్టనున్న రామాలయ తొలిదశ అభివృద్ధి పనులు 2027వ సం.లో జరగనున్న పుష్కరాల నాటికి పూర్తి చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఇందు కోసం ఇప్పటికే మంత్రి దిశా నిర్ధేశం చేశారు. తయారు చేసిన నామూనాల ప్రకారం రాత్రింబవళ్లు కట్టడాలు నిర్మించేలా ఆర్కిటెక్ట్ ఇంజనీర్లు సిద్ద పడుతున్నారు. స్థపతి నారాయమూర్తితో పాటు వైదికపెద్దలు సిద్ధం చేసిన ప్లాన్‌ను ప్రభుత్వం ఆమోదించిన విషయం తెలిసిందే. ఎంతో కాలంగా రామాలయం అభివృద్ధి జరుగుతుందని ఆశించినప్పటికీ నిరాశే మిగిలింది. గత బిఆర్ఎస్ పాలనలో బ్లూ ప్రింట్‌లు తయారు చేసి ఇదిగో అభివృద్ధి, అవిగో పనులు అంటూ ఊరించినప్పటికీ ఒక్క ఇటుక పెళ్ల కూడా వేయలేదు. భద్రాచలం రామాలయాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పకుండా పనులు చేపట్టనుండటంతో దేశవ్యాప్తంగా రామభక్తులు హర్షాతి రేఖాలు వ్యక్తమవుతున్నాయి.

# ఎంఎల్ఎ కూనంనేనికి వినతుల వెల్లువ



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** హైదరాబాద్‌లో మైనర్ శస్త్ర చికిత్స అనంతరం పక్షం రోజుల తర్వాత నియోజకవర్గ కేంద్రానికి చేరుకున్న ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావుకు ఆదివారం పలువురు వినతిపత్రాలు సమర్పించారు. స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌కు చేరుకున్న ఆయనను ఈ సందర్భంగా కలిసేందుకు పలువురువచ్చారు. షాలువాలు కప్పి,పుష్పగుచ్ఛాలను అందించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పోడు భూములు, రహదార్లు, డ్రైన్లు, మంచి నీటి సమస్యపై పెద్ద ఎత్తున వినతులు అందాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూప్రాధాన్యతా క్రమంలో ఇప్పటకే మౌళికసదుపాయాల ఏర్పాటుకు పెద్దపీఠ వేశామని, నియోజకవర్గంలోని పట్టణాలు, గ్రామాలు, పల్లెలు, తండాలు,కాలనీలు కలుపుకుని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంత సమస్యలపై ఇప్పటికే అసెంబ్లీలో పలుమార్లు మాట్లాడానని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నియోజకవర్గాభివృద్ధికి సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు ముత్యాల విశ్వనాథం, కంచర్ల జమలయ్య, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, సలిగంటి శ్రీనివాసరావు, వాసిరెడ్డి మురళీ, కార్పోరేటర్లు, సర్పంచ్‌లు, మహిళా సంఘాల నాయకురాళ్లు రత్నకుమారి, లక్ష్మి, షాహిన్, ఇస్కాఫ్ నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు

(మొదటిపేజీ తరువాయి)

నని స్పష్టం చేశారు. ప్రజల హక్కుల సాధన, సంక్షేమం కోసం సీపీఐ పార్టీ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆయా శాఖల నూతన కమిటీలను అధ్యక్షకార్యదర్శులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కామంచికల్ సీపీఐ గ్రామశాఖ కార్యదర్శిగా షేక్ పాషా, సహాయకార్యదర్శిగా వెంకటకృష్ణ, పడమటితండా సీపీఐ గ్రామశాఖ కార్యదర్శిగా శంకర్, సహాయకార్యదర్శిగా నరేష్, దారేడు సీపీఐ గ్రామశాఖ కార్యదర్శిగా మీరా, సహాయకార్యదర్శిగా సుమన్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, అజ్మీరా రామ్మూర్తి, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రమేష్, సీపీఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన మేయర్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలోని ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన నయాగరా పాల్స్ ఎగ్జిబిషన్‌ను మేయర్ పునుకొల్లు నీరజ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఖమ్మం నగర ప్రజలు కుటుంబ సమేతంగా సందడిగా గడిపేందుకు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. ఈ ఎగ్జిబిషన్‌లో చిన్నారులతో పాటు ప్రతి ఒక్కరూ సరదాగా గడిపేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారన్నారు. దీనిని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, ఎఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, నాయకులు రావూరి సైదబాబు, నిర్వహకులు వాసు, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కట్టా కృష్ణార్జున్‌రావుని చూడాలి అన్న కెటిఆర్..

## -వైరా నాయకులతో త్వరలోనే సమావేశం




**ప్రజాపక్షం/వైరా:** బిఆర్ఎస్ జిల్లా నాయకులు మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జున్‌రావును బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట లతారకరామారావు ఒకసారి చూడాలని ఆయనని, నూతన మున్సిపాలిటీ కౌన్సిలర్లని, పార్టీ కోసం కష్టపడుతున్న ముఖ్య నాయకులను కలవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో ఇటీవల హైదరాబాద్‌లో అన్నారు. గురువారం వైరాలో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కట్టా కృష్ణార్జున్‌రావుతో, ఇతర నాయకులతో తెలిపారు. త్వరలోనే వైరా నాయకులను హైదరాబాద్‌లో కెటిఆర్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం వైరా నాయకులు నిరంతరం శ్రమిస్తున్నారని అధికార పార్టీ సైతం ధీటుగా ఎదుర్కొంటూ జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తా చాటారని పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కట్టా కృష్ణార్జున్‌రావుని చూడాలని కెటిఆర్ తెలిపారని, పార్టీ నాయకులతో ముఖాముఖి సమావేశం త్వరలోనే ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు.

# మేడే స్ఫూర్తితో ఎనిమిది గంటల పని విధానానికి పోరాడాలి

**-ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మేడే స్ఫూర్తితో కార్మికులు హక్కుగా పొందిన ఎనిమిది గంటల పని విధానానికి పోరాడాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో 141వ మేడే గోడ ప్రతులను ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్‌తో కలిసి శింగు నర్సింహారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శింగు నర్సింహారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కుల హననం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా కార్మిక హక్కులు కనుమరుగవుతున్నాయన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిన తర్వాత కార్మికుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. కార్మికులకు హక్కులుగా ఏ చట్టాన్ని కూడా ఏ ప్రభుత్వం దయతో, ఇష్టంతో చేయలేదని ఆ చట్టాలన్ని తమ రక్తాన్ని చిందించి కార్మికులు పోరాడి సాధించుకున్నారన్నారు. అటువంటి చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు రావాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. నిజంగా మోడీకి కార్మికులపై ప్రేమ ఉంటే వారి సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఉన్న కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. కానీ కార్మికుల హక్కులను కాలరాస్తూ యాజమాన్యానికి అనుగుణంగా ఉండే లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చారన్నారు. మోడీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో కార్మికుల కోసం ఖర్చు చేసింది ఏమి లేదని కానీ కార్పొరేటర్ శక్తులకు లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారన్నారు. ఎంపి జీతాలు పెంచిన నరేంద్ర మోడీ కార్మికుల కనీస వేతనం రోజుకు రూ. 70లకు కుదించడం దారుణమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికుల ఉపాధి కొరకు ఏర్పాటు చేసిన మహత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై కూడా మోడీ సీత కన్ను వేశారని దానిని నిర్వీర్యం చేసేందుకు ప్రతి యేటా నిధులు తగ్గిస్తూ పని దినాలను తగ్గించారన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజీల్, గ్యాస్ ధరల పెరుగుదల కారణంగా రవాణా రంగంలోని కార్మికులు తీవ్ర నష్టానికి గురవుతున్నారని నెల వారి కిస్తీలు కట్టలేక, వేరే పని చేసుకోలేక రవాణా రంగంలోని కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు.నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అసంఘటిత రంగమే కాకుండా సంఘటిత రంగంలోని కార్మికులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులు సాధించుకున్న హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, కార్యనిర్వహక అధ్యక్షులు రావి శివ రామకృష్ణ, మహిళా సమాఖ్య నాయకురాలు పోటు కళావతి, ఉపాధ్యక్షులు ఎండి జాకీరుద్దీన్, కోశాధికారి షేక్ ఇబ్రహీం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# యువత పోరాటాలకు సిద్ధం కావాలి

**-ఏఐవైఎఫ్ మహాసభల్లో యువత పాల్గొనండి**
**-ఏఐవైఎఫ్ గ్రామశాఖ మహాసభలు నూతన కమిటీలు ఎన్నిక**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నిరుద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలైన నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలుపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్ లు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఏఐవైఎఫ్ మహాసభల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఆదివారం రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామంలో ఏఐవైఎఫ్ గణేశ్వరం, చింతగుర్తి గ్రామశాఖల మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ఏఐవైఎఫ్ గ్రామశాఖ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే చింతకాని, రఘునాథపాలెం, కూసుమంచి మండలాల్లో మహాసభలు జరుగుతున్నాయన్నారు. నిరుద్యోగ యువతకు బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ అమలుపై యువత పోరాడాలన్నారు. గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌కు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలన్నారు. అనంతరం నూతన గ్రామ శాఖ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బాగం ప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు, సోషల్ మీడియా ఇంచార్జి శివ, వెంకన్న, రామకృష్ణ, శ్రీనివాసరావు, అశ్రం, వీరు, బాలాజీ, నరేష్, వాసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ మ్యూజియంను సందర్శించిన విద్యార్థులు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన సైన్స్ మ్యూజియంను మోటమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచనల మేరకు కలెక్టర్, జిల్లా విద్యా శాఖాధికారి ఆదేశాల మేరకు సైన్స్ మ్యూజియంను ఆదివారం కూడా తెరిచి ఉంచారు. మధిర మండలం మోటమర్రి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు సైన్స్ మ్యూజియంను సందర్శించారు. విద్యార్థులకు జిల్లా సైన్స్ అధికారులు రచ్చా శ్రీనివాస్, గైడ్ టీచర్స్ ఆదిత్య, నవీన్‌కుమార్, హనుమ లు పలు నమూనాలను వివరించారు. ఇతర స్కూల్ విద్యార్థులు కూడా సైన్స్ మ్యూజియంను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వారు సూచించారు.

# డ్రైనేజీ పూడికతీత పనులు ప్రారంభం

**ప్రజలు సహకారం అందించాలి : మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన సమస్య అయిన డ్రైనేజీ సమస్యకు సంబంధించి ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యను శనివారం ఆ సమస్య పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, వార్డు కౌన్సిలర్లు కట్టా కృష్ణార్జున్‌రావు, స్వరూపరాణి, మాదినేని సునీత ప్రసాద్, మున్సిపల్ శానిటేషన్ అధికారి వీరన్నతో కలిసి ఠాగూర్ విద్యాలయం సమీపంలోని ప్రధాన డ్రైనేజీ పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ వైరాలో ప్రధానమైన డ్రైనేజీ ఇది, ఈ డ్రైనేజీకి మున్సిపాలిటీ పరిధిలోని 2,3,4,5,6,9,12,13,14 వార్డుల్లో నీరు ప్రధానంగా ఈ డ్రైనేజీ నుంచే వెళ్లి సోమవరం నల్లచెరువు వద్ద ఉన్న వాగులో కలవడం జరుగుతూ ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రధాన డ్రైనేజీ ఆక్రమణకు గురికావడంతో పాటు పూర్తిగా పిచ్చి మొక్కలతో నీరు పోవడానికి అనుకూలంగా లేకుండా ఉందని, ఈ సమస్యను పరిష్కరించాలని ఒక ధృడ సంకల్పంతో కౌన్సిలర్ సభ్యుల సూచనల మేరకు మేజర్ డ్రైనేజీ పూడిక తీసి, ఆక్రమణల నుంచి కాపాడి వర్షాలు కురిసినప్పుడు వైరాలోని వర్షపు 12, 6 వార్డుల్లో నీరు ప్రవహించకుండా ప్రజలు ఇబ్బంది పడకుంగా ఉండాలని ఒక ఆలోచనతో ప్రధాన డ్రైనేజీలో పూడికతీత పనులను ప్రారంభించడం జరిగింది. ప్రజలు కూడా ఈ పనులకు సహకరించి మున్సిపాలిటీలో ప్రధాన డ్రైనేజీ వలన ప్రజలకు వర్షాలు వచ్చినప్పుడు వరద ప్రభావం తగలకుండా ఉండాలని, ఒక మంచి కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆమె తెలిపారు. త్వరలోనే ఈ డ్రైనేజీ పూర్తిస్థాయిలో వాడుకలోకి తీసుకురావడం జరుగుతుంది. అదేవిధంగా వరసిద్ది వినాయకుడి గుడి వద్ద నుండి ఠాగూర్ విద్యాలయం వద్ద వరకు ఉన్న మేజర్ డ్రైనేజీని కూడా పూర్తిస్థాయిలో వాడుకలోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఘాదినేని దుర్గాప్రసాద్, లగడపాటి ప్రభాకర్‌రావు, మున్సిపల్ సిబ్బంది, నాగరాజు పాల్గొన్నారు.

# కెసిఆర్, కెటిఆర్‌ను కలిసిన మాజీ మంత్రి పువ్వాడ





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసిఆర్, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్‌ను పువ్వాడ అజయ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన సందర్భంగా ఆశీర్వాదం తీసుకున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు కేసిఆర్, కేటిఆర్ లు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అజయ్‌కుమార్ తనయుడు నయన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు అండగా మంత్రి తుమ్మల

**-షాపు పత్రాలను అందించిన మేయర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చిరు వ్యాపారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అండగా నిలిచారని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను కోల్పోయిన 46, 47 డివిజన్లకు సంబంధించిన చిరు వ్యాపారులకు షాపుల అధికారిక పత్రాలను మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ చేతుల మీదుగా అందజేశారు ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో షాపులు కోల్పోయిన వారికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అండగా నిలిచారన్నారు. ఖమ్మం నగరంలో జరుగుతున్న అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సొసైటీ మాజీ అధ్యక్షులు తుపాకుల యలగొండస్వామి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యాలయానికి వాటర్ కూలర్ వితరణ



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్ల గ్రామపంచాయతీ కార్యాలయానికి ఎస్టీయు ఉపాధ్యాయసంఘం నాయకులు డాక్టర్ గోపాల్ రావు వాటర్‌కూలర్‌ను ఆదివారం వితరణగా అందించారు. తనికెళ్ల గ్రామసర్పంచ్ గడల కళావతి వాటర్‌కూలర్‌ను ప్రారంబించారు. ఈసందర్భంగా కళావతి మాట్లాడుతు ఎండలు తీవ్రత బాగా పెరిగిందని పంచాయతీ కార్యాలయ సిబ్బందితోపాటు వివిధ రకాల పనులపై పంచాయతీ కార్యాలయానికి వస్తున్న ప్రజలకు చల్లని మంచినీరు అందించి దాహార్తిని తీర్చేందకుగాను వాటర్ కూలర్‌ను వితరణగా అందించిన గోపాల్‌రావును ఆమె అభినందించారు. అనంతరం కూలర్‌దాతను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ చల్లా నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి బి రవికుమార్, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, సిపిఐ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, గాజుల వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్లు లేడిబోయిన సైదులు, బెజవాడ రాంబాబు, యాసా జ్యోతి, గ్రామస్థులు షేక్ రంజాన్, బాసా వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు ఆర్థికసాయం అందించడం అభినందనీయం




**ప్రజాపక్షం/కొణిజర్ల :** పేదలకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని గుబ్బగుర్తి సర్పంచ్ దంతాల ప్రశాంతి అన్నారు. మండల పరిదిలోని గుబ్బగుర్తి లో సోమవారం సూర్యోదయ సామాజిక సేవాసంఘం ఆధ్వర్యంలో చేయూతనందించారు. గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన షేక్ సలీం కుటుంబ సభ్యులకు రూ 25,000 లు, పామర్థి రామలక్ష్మి కుటుంబసభ్యులకు రూ 20,000లు, దయనీయ పరిస్థితిలో ఉన్న బలమాల ఉషారాణి కుటుంబసభ్యులకు రూ 20,000లు మొత్తంగా రూ 65,000లు ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. ఈసందర్భంగా సర్పంచ్ ప్రశాంతి మాట్లాడుతు గత మూడు సంవత్సరాలుగా గ్రామంలో సూర్యోదయ సామాజికి సేవా సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను ఆర్థిక సహాయం అందిస్తు మానవత్వాన్ని చాటుకుంటున్నారని అన్నారు. సూర్యోదయ సామాజిక సంస్థ, సభ్యులను ఆమె అభినందించారు. ముందు ముందు ఇలాంటి సేవా కార్యక్రమాలు అందించి గ్రామస్థుల మన్ననలు పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యుగుంధర్, మాజీ సర్పంచ్ నల్లపు ప్రసాద్, దంతాల నరసింహారావు, బాబూలాల్, వార్డు మెంబర్లు, సూర్యోదయ సంస్థ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామి పూజ పుస్తకావిష్కరణ

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అయ్యప్ప స్వామి మాల ధారణ ప్రాముఖ్యత, పూజ నియమావళి, భక్తి గీతాలతో రూపుదిద్దుకున్న పుస్తకాన్ని కిష్టారం కోదండ రామాలయం ఆలయ కమిటీ సభ్యులు నరుకుళ్ళ శేషగిరిరావు, సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరిఅప్పారావుల చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిష్టారం గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు సంవత్సర కాలం శ్రమించి మొంద్రు క్రాంతి కుమార్(గురు స్వామి) స్వీయ రచన, సమకూర్పుతో రూపుదిద్దుకున్న పుస్తకాన్ని ఆవిష్కరించటం ఆనందంగా ఉందన్నారు. హిందూ దేశంలో హిందువుల ఉనికి ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారిందని, హిందుత్వంలో చైతన్యం తేవడానికి మొంద్రు క్రాంతి కుమార్ వంటి కవులు తమ వంతు బాధ్యతను నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా పుస్తక ముద్రణకు సహకరించిన జేష్ట శ్రీధర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రావి నాగేశ్వరరావు, మాచినేని నరేంద్ర, కొడిమెళ్ళ అప్పారావు, కొలపనేని ధనుంజయ్, గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## సిఓఇ ప్రవేశ పరీక్ష విజయవంతం

**- 254 మంది గైర్హాజర్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** తెలంగాణ గిరిజన గురుకుల సిఓఇ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష విజయవంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా ముగిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో మొత్తం ఐదు సెంటర్లలో ఈ ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఈ ఐదు పరీక్షా కేంద్రాల్లో 1692 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 1468 మాత్రమే హాజరు కావడంతో 254 మంది గైర్హాజరయ్యారు. భద్రాచలం సిఓఇలో నిర్వహించిన పరీక్షా కేంద్రాన్ని ఆర్‌సిఓ అరుణ కుమారి పరిశీలించారు.

## డీసీసీ ఆర్గనైజేషన్ సెక్రటరీగా బోడ రమేష్




**ప్రజాపక్షం/పినపాక:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రటరీగా పినపాక మండలం దుగినేపల్లి గ్రామానికి చెందిన బోడ రమేష్ ఎన్నికయ్యారు. పార్టీ కష్టకాలంలోనే కాంగ్రెస్‌ను వీడకుండా నిలబడి, పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానన్నారు.

## ప్రజాసేవకు అంకితం కావాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన ప్రతీ ఒక్కరి ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడుతూ ప్రజా సేవకు అంకితం కావాలని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పాల్వంచ పరిధి శేఖరం బంజెర 33వ, డివిజన్ నుండి గెలుపొందిన బానోత్ బాలునాయక్ అభినందన సభను డివిజన్ ప్రజలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలూ నాయక్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. అనంతరం కొత్వాల మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా ఎన్నికలే లేకపోవటంతో ప్రజా సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయని అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్పోరేటర్లు ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జాలె జానకీరెడ్డి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఎస్‌ఏ. జలీల్, మాజీ జెడ్‌పిటిసి యర్రంశెట్టి ముత్తయ్య, పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల రంగారావు, వై. వెంకటేశ్వర్లు, దోర్నాల సతీష్, బదావత్ సామా నాయక్, గుగులోత్ బాలు పాల్గొన్నారు.

## సందడిగా మారిన పెద్దమ్మతల్లి దేవాలయం



**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి కేశవాపురం, జగన్నాధపురం గ్రామాల మధ్యన కొలువై ఉన్న (శ్రీకనకదుర ) పెద్దమ్మతల్లి దేవాలయం ఆదివారం అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో సందడిగా మారింది. జిల్లా నలుమూలల నుండి వచ్చిన భక్త జనంతో కిటకిటలాడింది.భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఒడిబియ్యం, చీరలు, కనుములు తదితర మొక్కులు చెల్లించుకొన్నారు.అదే విధంగా శ్రీ కాశీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తుల సౌకర్యం కోసం క్యూలైన్‌లో ఉచిత పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి వసతి కల్పించారు.

**27వ, తేదీన టెండర్లు :** ఆలయానికి చెందిన రెండు ఏసి ఫంక్షన్ హాల్స్, నూతన షాపింగ్ కాంప్లెక్స్‌లోని 1, 2 షాపులను, పూలు, పూల దండలు విక్రయించుకొనేందుకు తదితర లీజు హక్కులను పొందటానికి ఈ నెల 27వ, తేదీన ఆలయ ప్రాంగణంలో సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆసక్తి కలిగిన వారు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని ఆలయ కార్య నిర్వాహణాధికారి ఎన్. రజనీ కుమారి తెలిపారు.

## మల్లెంపాటి లక్ష్మీబాయికి ఘన నివాళులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం మాణిక్యరం గ్రామానికి చెందిన మల్లెంపాటి లక్ష్మీ బాయి ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసినదే. వారి దశ దిన కర్మల సమస్మరణ కార్యక్రమం ఆదివారం మాణిక్యారం గ్రామంలోని వారి స్వగృహంలో నిర్వహించారు. ఈసందర్భంగా కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు లక్ష్మీ బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి సేవలను స్మరించుకుంటూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈకార్యక్రమంలో సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు, కొత్తగూడెం కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, పాలేరు నియోజకవర్గం బిజెపి అధ్యక్షులు నున్న రవి, రిటైర్డ్ ఏఎస్ఐ కామినేని సత్యనారాయణ, డాక్టర్ బిక్కసాని సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు తుళ్లూరి వెంకటేశ్వర్లు(బాబు), మేకల వీరన్న, ఈదర చలపతిరావు, చాగంటి వెంకటేశ్వర్లు, కాపా చంద్రశేఖరరావు, అదపా పుల్లారావు, తుళ్లూరి పురుషోత్తంరావు, గడిపర్తి వీరభద్రరావు, నాగండ్ల శ్రీనివాసరావు, కరపట్టి సీతారాములు, కేసగాని ఉపేందర్, మాజీ సర్పంచులు ధారావత్ కిషన్, భూక్య సైదా, భూక్య రంగారావు పాల్గొని నివాళులర్పించారు. మృతురాలి కుమారుడు మల్లెంపాటి పుల్లారావు, అల్లుళ్లు సుబ్బారావు, వీరభద్రరావు, రవి తదితర కుటుంబ సభ్యులు హాజరై ప్రగాఢ సానుభూతి తెలిపారు.







**కేంద్రాలు ఉన్నా**

**అన్నపురెడ్డిపల్లిలో రైతుల ఆందోళన**

# కొనుగోలు సున్నా..?

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నప్పటికీ, అక్కడ కొనుగోలు ప్రక్రియ ఆలస్యం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాలు ఉన్నాయి కానీ కొనేది ఎవరు..ఎప్పుడూ అనే ప్రశ్న రైతుల్లో ఆందోళనను పెంచుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడం పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. తాగునీరు, షెడ్, గోదాముల సదుపాయాలు లేక రైతులు ధాన్యంతో రోజులు గడపాల్సి వస్తోంది. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ ధాన్యం తీసుకొన్ని 3 నుండి 4 రోజులు అయింది. కొనుగోలు ఎప్పుడు జరుగుతుందో తెలియదు. వర్షం వస్తే మొత్తం నష్టం అని చెబుతున్నారు. మరికొందరు రైతులు తూకం యంత్రాలు, సిబ్బంది కొరత కారణంగా సమయానికి కొనుగోలు జరగక ఆర్థికంగా నష్టపోతున్నామని అంటున్నారు. కేంద్రాల్లో కూర్చునే సౌకర్యం లేకపోవడం, తాగునీరు అందుబాటులో లేకపోవడం, గోదాముల కొరతతో ధాన్యం బయటే నిల్వ చేయాల్సి రావడం, వర్షానికి రక్షణ లేకపోవడం వంటి సమస్యలు రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. గంటలు కాదు, రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ప్రక్రియలో స్పష్టత లేకపోవడం వల్ల రైతుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై అధికారులు స్పందిస్తూ, కొనుగోలు ప్రక్రియ దశలవారీగా కొనసాగుతోందని, వసతుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. అయితే రైతులు మాత్రం వెంటనే మౌలిక వసతులు కల్పించి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, లేకపోతే భారీగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# ఆక్రమించడం.. అద్దెకివ్వడం..!!

- మండలకేంద్రంలో యదేచ్ఛగా డ్రైనేజీల ఆక్రమణలు
- వ్యాపార కేంద్రాలుగా మారిన డ్రైనేజీలు
- ఆక్రమణలపై పట్టింపులేని అధికార యంత్రాంగం









**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రమైన జూలూరుపాడు హైవే రోడ్డు మార్జిన్లను ఆక్రమిస్తున్నారు. మురుగు కాలువలను పది అడుగులు ముందుకు వచ్చి రేకులు షెడ్లు, షాపులు ఏర్పాటుచేసి ప్రైవేట్ యజమానులు అద్దెలకు ఇస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవ హరిస్తు న్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. ప్రధాన హైవే రోడ్డు ఇరువైపులా ఉన్న డ్రై నేజీ కాలువలపై అక్రమాలు అధికంగా ఉన్నాయి. ఈప్రాంతంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో వ్యాపారాలు అధికంగా జరుగుతుంటాయి. దీన్ని భవన యజమానులు అవకాశంగా మలుచుకుంటున్నారు. తమ భవనాలు ముందు ఉన్న ప్రదేశాలను మెల్లమెల్లగా ఆక్రమించుకుంటున్నారు. ఆతర్వాత అడ్డగోలుగా షెడ్లు ఏర్పాటుచేసి అద్దెకు ఇచ్చి లబ్ధి పొందుతున్నారు. కాలువలపై ఆక్రమణలు ప్రజలకు తలనొప్పిగా మారాయి. కాలువలు ఉంటున్నట్టు కూడా తెలియని విధంగా ఆక్రమణలు వెలిశాయి. రహదారికి ఇరువైపుల ఆక్రమణలు. డ్రెయినేజీ లపై అక్రమ నిర్మాణాలు ఆపై రహదారులు మూసుకుపోయేలా రేకులను ఏర్పాటుచేస్తే వాహనాల రాకపోకలకు, పాదచారులకు ఎంత అసౌకర్యంగా ఉంటుందో ఊహించవచ్చు.

### లాభార్జనే ధ్యేయంగా డ్రైనేజీల ఆక్రమణలు...

మండల కేంద్రమైన జూలూరుపాడులోని రాష్ట్రీయ రహదారి, పాపకొల్లు, జూలూరుపాడు రామాలయానికి వెళ్లే రహదారులు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. కొందరు ఇంటి యాజమానులు, వ్యాపారులు రహదారి స్థలాన్ని, డ్రెయినేజీలను ఆక్రమించి వ్యాపార కేంద్రాలుగా మార్చారు. వాటిని అద్దెకిచ్చి నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు సంపాదిస్తున్నారు. డ్రెయినేజీలపై, రహదారుల వెంట నిర్మాణాలను చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని తెలిసిన లాభార్జనే ధ్యేయంగా వారు ఆక్రమిస్తున్నారు. దీంతో ప్రజలకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. పాపకొల్లు వెళ్లే రహదారిలోనే బ్యాంకులు ఉండటంతో జనం రద్దీ అధికంగా ఉంటుంది. కాగా ఈ అక్రమ నిర్మాణాల కారణంగా పార్కింగ్ లేక రహదారిపైనే వాహనాలు నిలపాల్సివస్తుంది. దీంతో ఈ రహదారిపై రాకపోకలు స్తంభించే పరిస్థితులు తరుచూ ఉత్పన్నమవుతున్నాయి. నడవటానికి కూడా ఇబ్బందులు పడాల్సివస్తుంది. అదే విధంగా ప్రధాన రహదారి నుంచి జూలూరుపాడులోని రామాలయానికి వెళ్లే వీధులో కూడా అక్రమ నిర్మాణాలను చేపట్టారు. కొందరు వ్యాపారులు రహదారిని ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీల పైనే నిర్మాణాలను చేపట్టడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

### అమలుకాని ఉన్నతాధికారుల ఆదేశాలు....

రహదారుల వెంట డ్రెయినేజీల పై అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వాటిని తొలగించి చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు కూడా జారీ చేయడం జరిగింది. కాగా సదరు అధికారులు మాత్రం ఆక్రమణల గురించి పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదు.

### మొక్కుబడిగా నోటీసులు జారీ..!

మొక్కుబడిగా ఆక్రమణ దారులకు నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్నారు. రోజులు గడుస్తున్న సమస్య పరిష్కారానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలను సైతం అధికారులు బేఖాతర్ చేస్తున్నారని ప్రజలంటున్నారు. ఇప్పటికైనా అధి కారులు తక్షణమే ఆక్రమణలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### పుష్కలంగా నాయకుల అండ దండలు...

ఆర్‌అండ్ బీ శాఖ, అధికార పార్టీ నేత అండదండలతో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమించుకున్న తాత్కాలిక షాపులను అద్దెకు సైతం ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రహదారిని, డ్రైనేజీని ఆక్రమించుకుని అద్దెకి ఇవ్వడం పట్ల గ్రామస్తులు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

# పేరుకే రిక్వెస్ట్ బస్ స్టాప్

**బస్సులు ఆగక ప్రజలు, విద్యార్థినిల ఇక్కట్లు**



- అధికారులు పట్టించుకోవాలని డిమాండ్
- డ్రైవర్ల నిర్లక్ష్యం సాక్షిగా తప్పని తిప్పలు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీలోని భారత్ గ్యాస్ సమీపంలోని ఖమ్మం,సూర్యాపేట రాష్ట్రీయ రహదారిపై ఏర్పాటు చేసిన రిక్వెస్ట్ బస్ స్టాప్ అలంకార ప్రాయంగా మారింది. అక్కడ బస్సులు ఆగకపోవడంతో 30వ వార్డులోని సాయి బృందావన కాలనీ వాసులతో పాటు పలు కాలనీల ప్రజలు పరిసర ప్రాంతాల్లోని హాస్టళ్లలో నివాసం ఉంటున్న జేఎన్టీయూ కళాశాల విద్యార్థినిలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.ఈ బస్‌స్టాప్ ప్రధానంగా డ్రైవర్ల నిర్లక్ష్యం సాక్షిగా అక్కరకు రాని పరిస్థితి నెలకొన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులు ఉదయం, సాయంత్రం కళాశాలకు వెళ్లేందుకు, తిరిగి హాస్టళ్లకు చేరుకునేందుకు రహదారిపై ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాలనీవాసులు బస్సులు ఆపడంలేదని వాపోతున్నారు.

### పరీక్షల నేపథ్యంలో ఆందోళన...

ప్రధానంగా జేఎన్టీయూ కళాశాల విద్యార్థులకు ఎంతో ముఖ్యమైన పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థినిలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బస్సులు రిక్వెస్ట్ బస్‌స్టాప్ వద్ద ఆగకపోవడంతో పరీక్షలకు సరైన సమయంలో చేరుకోలేకపోతున్నామంటున్నారు. అంతేకాకుండా కళాశాల వద్ద ఆపిన బస్సులు రిక్వెస్ట్ బస్ స్టాప్ వద్ద కాకుండా వరంగల్‌క్రాస్‌రోడ్డు సెంటర్‌లో ఆపుతున్నాయని తెలిపారు. దీంతో విద్యార్థినిలు సుమారు రెండు కిలోమీటర్లు వెనక్కి నడుచుకుంటూ తమ హాస్టళ్లకు చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుందంటున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ఈ పరిస్థితి భద్రతాపరమైన ఆందోళనలకు దారితీస్తోందని పేర్కొంటున్నారు.

### డ్రైవర్ల నిర్లక్ష్యం...

రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేసినప్పటికీ బస్సులు ఆగకపోవడానికి డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. సాక్షాత్తు ఆర్టీసీ అధికారులు బస్‌స్టాప్ ఏర్పాటు చేసినప్పటికీ విస్మరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థినిల భద్రతను దృష్టిలో ఉంచుకొని తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రిక్వెస్ట్ బస్ స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులు తప్పనిసరిగా ఆగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థినిలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా పరీక్షల కాలంలో ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### సమస్యను పరిష్కారం చేయాలి



చేయ్యొత్తితే ఆర్టీసీ బస్సు ఆగుతుందనే నమ్మకం ప్రజల్లో ఉంది.అది సన్నగిల్లేలా చేసుకోవడం సరికాదు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకొని సమస్యను పరిష్కార చర్యలు తీసుకోవాలి.

– 30వ వార్డు సిపిఐ కౌన్సిలర్, దండి శ్రీజ

### చర్యలు తీసుకుంటాను

పరిశీలన చేసి ఆ స్టాప్‌లో బస్సులు ఆగేలా చర్యలు తీసుకుంటాను.రిక్వెస్ట్‌స్టాప్ వద్ద బస్సులు నిలిపేలా ఎనౌన్స్‌మెంట్‌లో సైతం చెప్పిస్తాను.

– శివప్రసాద్, బస్‌డిపో మేనేజర్

# బోర్డు ఉంది..రోడ్డు లేదు..

**-మూడేళ్లుగా నిలిచిన రూ 168లక్షల బీటీ రోడ్డు పనులు**
**-అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు, వెంటనే చర్యలు తీసుకోవాలి**






**ప్రజాపక్షం/ములకలపల్లి:** అభివృద్ధి పేరుతో పనులు ప్రారంభమై మధ్యలోనే ఆగిపోతే గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తీవ్రంగా ఉంటాయి. జగన్నాధపురం పంచాయితీ పరిధిలోని రేగులకుంట గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు దీనికి స్పష్టమైన ఉదాహరణగా మారింది. రూ 168లక్షల వ్యయంతో నిర్మించాల్సిన ఈ రోడ్డు పనులు మూడేళ్లుగా నిలిచిపోవడం గ్రామ ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. రోడ్డు నిర్మాణానికి బోర్డు ఏర్పాటు చేసి "బీటీ రోడ్డు పై దమ్ము చక్రాల వాహనాలు తిరగరాదు"అంటూ హెచ్చరికలు ఉంచడం పరిస్థితిని మరింత విచిత్రంగా మార్చింది. రోడ్డు లేకుండానే ఇలా బోర్డు పెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఐటిడిఏ నిధులతో ప్రారంభమైన ఈ పనులు, ప్రభుత్వం మారిన తర్వాత నిలిచిపోవడం గమనార్హం. అభివృద్ధి కార్యక్రమాలు రాజకీయ మార్పులతో ఆగిపోవడం ప్రజలలో నమ్మకాన్ని దెబ్బతీస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సరైన రోడ్డు లేకపోవడంతో రవాణా ఇబ్బందులు, అత్యవసర సేవల ఆలస్యం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించి వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కొనసాగుతున్న విరాళాల పర్వం

**-చదివిన పాఠశాలకు చేయూత**






**ప్రజాపక్షం/అశ్వాపురం:**నెల్లిపాక బంజరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు తమ పాఠశాల అభివృద్ధికి చేయూత నందిస్తూ ఆదర్శంగా నిలిచారు. చదివిన పాఠశాలకు కొంతైనా సహాయం చేసి ఋణం తీర్చుకోవాలనే తపనతో వారు ముందుకు రావడం ప్రశంసనీయం. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కొరకు ఆటో కొనుగోలు నిమిత్తం గ్రామ సర్పంచ్ మంద్రు రామకృష్ణ గ్రామంలోని ఉన్న వారు విరాళాలు అందించాలని అభ్యర్థన మేరకు గ్రామస్తులు, ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి సహాయం అందిస్తున్నారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు చావా రామకృష్ణ రూ 50వేలు, నిడదవోలు అనిత, దుర్గారావు దంపతులు పాఠశాల రూ 25వేల సహాయం చేశారు. అలాగే పుట్ట అనిల్ కుమార్ రూ 10వేల ఆటో కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించారు. తమకు విద్యాబోధన చేసి జీవితంలో స్థిరపడేందుకు మార్గం చూపిన పాఠశాలకు తిరిగి సేవ చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సహాయం ద్వారా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆటో కొనుగోలుకు వారి ప్రయాణం మెరుగుపరచడం ద్వారా విద్యను అందించడం సాధ్యమవుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈసందర్భంగా సర్పంచ్ మంద్రు రామకృష్ణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల ఈ సేవా కార్యక్రమం చేయడం సంతోషంగా ఉందని ఇటువంటి కార్యక్రమాలు మరింత మంది పూర్వ విద్యార్థులను ప్రేరేపించి, పాఠశాల అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తమవుతోందని, చదివిన పాఠశాలకు చేయూతనిచ్చే ఈ గొప్ప కార్యక్రమం సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు.

## 25వ రోజు రిలేనిరాహార దీక్షలు కొనసాగింపు




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 25వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కార్మికులు తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం నిర్వహించిన దీక్షలో కాంట్రాక్ట్ కార్మికులకు మద్దతుగా శ్రీకొండోజు కృష్ణమాచారి, నూనావత్ దులసింగ్, ప్లాంటేషన్ మహిళా కార్మికులు భూక్య అరుణ, కస్తూరి పాల్గొన్నారు. వారికి జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో కన్వీనర్లు బల్లెం నాగయ్య, ఆకినీ నాగేశ్వరరావు, చుక్కపల్లి బాలాజీ, నమ్మక, బాబు తదితరులు పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల వేతన ఒప్పందంపై వెంటనే జేఏసీతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ప్లాంటేషన్ మహిళా కార్మికులు భారీగా పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు.

## నిరుద్యోగ సమస్య పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



**ప్రజాపక్షం/కారేపల్లి:** రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతుండగా, దానిని పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రగతి శీల యువజన సంఘం(పీవైఎల్)రాష్ట్ర కమిటీ సభ్యుడు భూక్య శివ నాయక్ ఆరోపించారు. నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. పీవైఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఒక సంవత్సరంలో లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించిందని విమర్శించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న నిరుద్యోగ భృతి అమలు ఎక్కడ ఉందని ప్రశ్నించిన ఆయన, వెంటనే నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మత్తు పదార్థాలు, గంజాయి, డ్రగ్స్ విస్తరిస్తున్నాయని, బెల్ట్ షాపులు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. మద్యం ఆదాయంపై ప్రభుత్వం ఆధారపడటం సిగ్గుచేటని విమర్శించారు. కారేపల్లి మండలంలో గిరిజన రైతులు అధికంగా మొక్కజొన్న పండిస్తున్నప్పటికీ, గుండాలలో ఇప్పటికీ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. వెంటనే మొక్కజొన్న కొనేగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

## పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్‌ల పంపిణీ



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు భాగంగా హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సిఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సిఐ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం తప్పని సరి అని, ప్రమాదం ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందో తెలియదని, చిన్న నిర్లక్ష్యం ప్రాణాలను ప్రమాదంలో పడేస్తుందని హెచ్చరించారు. అనంతరం శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు మాట్లాడుతూ ప్రాణాలకు మించినది ఏదీ లేదని, హెల్మెట్ ధరించడం ద్వారా కుటుంబాలను కాపాడుకోవచ్చని, ఈకార్యక్రమం చాలా అవసరమైనదని అన్నారు. మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురు కృష్ణ మాట్లాడుతూ చట్టపరంగా మాత్రమే కాదు, వ్యక్తిగత భద్రత కోసమూ హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమం ద్వారా హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా పోలీసులు ముందుకు రావడం విశేషమన్నారు. అశ్వాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులుల రాజేందర్ మాట్లాడుతూ హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని కోరారు. ఈకార్యక్రమం ద్విచక్ర వాహనదారులు, ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు మేడవరపు సుధీర్, గోపీనాథ్ లెనిన్, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/పినపాక:** మండలంలోని జానంపేట నాగులమ్మ గుడి సన్నిధిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆటో యూనియన్ నూతన కమిటి ఎన్నిక నిర్వమించగా, తోగటి కుమార్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జానంపేటలో ఆటో యూనియన్ పాత కమిటీ కాలపరిమితి ముగిసినందున ఎన్నికల్లో నూతన కార్యవర్గంను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయని, కిరాయిలు దొరకక ఆటోలు అమ్ముకుంటూ రోజు కూలికి పోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు కావుల రమేష్, కార్యదర్శి వట్టం నాగరాజు, జాయింట్ కార్యదర్శి పూణెం కళ్యాణ్, ప్రచార కార్యదర్శి ఎస్‌కే రహీం, సతీష్, కోర్స రాము, సుతారపు మున్న, గౌరవ అధ్యక్షులు అక్కిరెడ్డి శంకర్, గుండం దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం గ్యాస్ట్రో హాస్పిటల్ ప్రారంభం

**-ప్రారంభించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్**



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం :** ఖమ్మం నగరంలోని వినోద థియేటర్ సమీపంలో నూతన ఖమ్మం గ్యాస్ట్రో హాస్పిటల్‌ను ఆదివారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్, మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలతో పాటుగా నల్గొండ, వరంగల్ జిల్లాల ప్రజలకు అత్యాధునిక గ్యాస్ట్రో వైద్యసేవలు అందించేందుకు ఖమ్మం గ్యాస్ట్రో హాస్పిటల్‌ను నెలకొల్పడం హర్షనీయమన్నారు. అనంతరం ఆస్పత్రి డాక్టర్లు గోంగూర వెంకటేశ్వర్లు, ముదిరెడ్డి అనిమేష్ రెడ్డిలు మాట్లాడుతూ హాస్పిటల్ నందు గ్యాస్ట్రో ఎంటరాలజీ చికిత్స, ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, ఈఆర్‌సిపి, లివర్ వ్యాధుల చికిత్స, పాంక్రియాటైటిస్, సర్జికల్ గ్యాస్ట్రో, అడ్వాన్స్ లాపరోస్కోపి, గైనకాలజీ సర్జరీలు, జీర్ణకోశ శస్త్ర చికిత్సలు, క్రిటికల్ కేర్, ఎమర్జెన్సీ, ఎండో గైనకాలజీ, కిడ్నీ, డయాలసిస్ తదితర వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గల్లా సత్యనారాయణ, రుద్రప్రదీప్, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, ఎమ్మెల్సీ బిఆర్‌ఎస్ అధ్యక్షులు తాతా మధు, టిడిపి పార్లమెంటు కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ ఎన్డీ బండారి ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, 24వ డివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి, 45వ డివిజన్ కార్పొరేటర్ బుడిగం శ్రీనివాసరావు, ఐఎంఎ నాయకులు వైద్యులు బి శ్రీనివాసరావు, కంభంపాటి నారాయణరావు, రెహానా బేగం, ముక్కపాటి కోటేశ్వరరావు, ఖమ్మం గ్యాస్ట్రో హాస్పిటల్ డైరక్టర్లు గోగిరెడ్డి అరుణ, పరుపాటి స్వాతిరెడ్డి, వైద్యులు విష్ణుప్రియ, ముదిరెడ్డి అభిలాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో ఘనంగా మాజీ మంత్రి పువ్వాడ జన్మదిన వేడుకలు





**ప్రజాపక్షం/వైరా :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ 60వ పుట్టినరోజు వేడుకలను వైరాలో బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం నందు మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు అప్పం సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జున్ రావు, వనమా విశ్వేశ్వరరావు ముఖ్య అతిధులుగా పాల్గొని పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేయించి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పువ్వాడ అజయ్‌కుమార్ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండి మరోసారి రాష్ట్ర ప్రజలకు జిల్లా ప్రజలకు సేవలు అందించాలని అన్నారు. పువ్వాడ అజయ్‌కుమార్ మంత్రిగా ఉన్న సమయంలో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిలో నడిపారని, మరోసారి ఆ అవకాశాన్ని దేవుడు ఆయనకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు హ్యాపీ బర్త్‌డే పువ్వాడ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భూమాత కృష్ణమూర్తి, మహిళా అధ్యక్షురాలు సక్కుబాయి, మాదినేని దుర్గప్రసాద్, కామినేని శ్రీనివాసరావు, ఏదునూరి శ్రీను, నూకల వాసు, షేక్ పాషా, తిరుపతి శ్రీను, ఆదూరి ప్రేమ్, కారుకొండ బోస్, మరికంటి శివ, బత్తుల లింగారావు, గుజ్జర్లపూడి దేవరాజ్, వజినేపల్లి చక్రవక్తి, పూర్ణకంటి దాసు, ముదిగొండ వెంకటనారాయణ, నల్లగొండ నాని, మడుపల్లి కృష్ణ, విలాసాగరం నరేష్, దానయ్య, ముదిగొండ పుల్లయ్య, యండ్రాతి గోపాలరావు, బొడ్డు రామకృష్ణ, బండారు శ్రీనివాసరావు, ముదిగొండ పుల్లయ్య, ఫణితి శాంతయ్య, షేక్ సైదా, ఏలూరు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యలో అశాస్త్రీయమైన కోర్సులు తొలగించాలి

**-జెవివి విద్యా సదస్సులో వక్తలు డిమాండ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉన్నత విద్యలో అశాస్త్రీయమైన కోర్సులు ప్రవేశపెట్టడాన్ని పూర్తిగా తొలగించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఖమ్మం డిపిఆర్‌సి భవన్‌లో జెవివి రాష్ట్ర అధ్యక్షులు చెలిమల రాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన విద్యా సదస్సులో ఎన్ఈపి 2020 ఉన్నత విద్య తీరు తెన్నుల అంశంపై ప్రముఖ విశ్లేషకులు డా॥ అందె సత్యం, ఎన్‌సిఎఫ్ 2023 పాఠ్యాంశాల్లో మార్పులు అంశంపై విశ్రాంత ఆచార్యులు కోయ కోటేశ్వరరావు , తెలంగాణ పాఠశాల విద్య సవాళ్లు అనే అంశంపై సొసైటీ ఫర్ ఛైంజింగ్ ఎడ్యుకేషణ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎడమ శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విశ్వ విద్యాలయాలే స్వయంగా నిధులు సమకూర్చుని నడపడం వల్ల వాటిలో కేవలం ధనిక విద్యార్థులు మాత్రమే అభ్యసించగలుగుతారని ఇది సరైన విధానం కాదన్నారు. గ్రేడింగ్ సిస్టం ద్వారా డిగ్రీని నాలుగేళ్లు చదవాల్సిన అవసరం ఉండదని దీని వల్ల డిగ్రీ చదివే వారి సంఖ్య తగ్గిపోతుందని అభిప్రాయపడ్డారు. ఎన్‌సిఈఆర్‌టి పుస్తకాల్లో డార్విన్ సిద్ధాంతం, పిరియాడిక్ , జెనటిక్స్ వంటి బేసిక్స్ సైన్స్ పాఠాలు తీసివేయడం, చరిత్రలో మధ్య యుగాల నాటి ముస్లిం చరిత్రను పూర్తిగా తొలగించడం, అశాస్త్రీయమైన అంశాలను, రుజువు కాని అంశాలను చేర్చడం వంటి మార్పులు తీసుకు వచ్చారన్నారు. దేశంలో ఇప్పటికీ 34 కోట్ల మంది నిరాక్షరాస్యులుగా ఉన్నారని వీరిని అక్షరాస్యులుగా చేర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టడం లేదన్నారు. ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ పిల్లల మనో వికాసాన్ని పెంచేలా ఉండేలా తప్ప చదువు అనే అంశాన్ని ఆ స్థాయిలో ఉంచవద్దన్నారు. ఇంటర్ స్థాయిలో పోటీతత్వం వల్ల స్పర్థలు పెరిగి ఒకరిపై ఒకరికి ద్వేష భావం పెరిగే అవకాశం ఉందన్నారు. విద్యా సదస్సులో పలు ప్రతిపాదనలు చేశారు. బాల్య దశ నుంచి ఉన్నత విద్య వరకు అందరికి ఉచిత విద్య, నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించాలని, విద్యలో ప్రైవేటీకరణ, వ్యాపారీకరణను నిలిపివేయాలని, జిడిపిలో కనీసం ఆరు శాతం నిధులు కేటాయించాలని, ఎన్ఈపి 2020 రద్దు చేసి రాష్ట్ర హక్కులను పరిరక్షించాలని, ఉపాధ్యాయులపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించి ఉపాధ్యాయుల నియామకాలు పెంచాలన్నారు. సమాజ ఆధారిత అక్షరాస్యత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు అలవాల నాగేశ్వరరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు శివన్నారాయణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్‌వి రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణశ్రీ, జెవివి గౌరవాధ్యక్షులు మల్లెంపాటి వీరభద్రరావు, వంజాకు లక్ష్మినారాయణ, జిల్లా అధ్యక్షులు వి. మోహన్, ప్రధాన కార్యదర్శి కె. రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసిన కార్మికులకు మూడు నెలల నుండి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వారి వేతనాలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20 న సత్తుపల్లి తహశీల్దార్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని జాజిరి పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని జాజిరి సందర్శించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి ఉపాధి హామీ చట్టానికి రక్షణ లేకుండా పోయిందన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్య కా స మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, తడికమళ్ళ రామకృష్ణ, వల్లపు లక్ష్మి, హెచ్చు వెంకటమ్మ, గుంజి సత్యవతి, గుంజి వెంకటేశ్వరరావు, కుంచపు నందిని, భారతి, పద్మ, నారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# అజయ్‌కుమార్ పుట్టిన రోజు సందర్బంగా సేవా కార్యక్రమాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఖమ్మం నగరంలోని ఏడవ డివిజన్‌లో సత్తి అంజమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం అజయ్‌కుమార్ జన్మదిన సందర్భంగా సత్తి అంజమ్మ ట్రస్ట్ నిర్వహకులు సత్తి శివకృష్ణ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో యువత పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. చౌరస్తాలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ప్రారంభించారు. 50 మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ప్రారంభించారు. సత్తి శివకృష్ణను ఈ సందర్భంగా పలువురు నాయకులు అభినందించి వారి సేవా స్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, సుడా మాజీ డైరెక్టర్ దొంగల తిరుపతిరావు, బిఆర్‌ఎస్ నగర యువజన అధ్యక్షులు దేవభక్తిని కిషోర్‌బాబు, డివిజన్ అధ్యక్షులు చిలకల వెంకటనర్సయ్య, లింగనబోయిన లక్ష్మణ్, సద్దాం షేక్, మహ్మద్ మోసిన్, సయ్యద్ సాజీద్, మాధవి, శైలజ, తంగెళ్ల పవన్, దోసపాటి మణికంఠ, విజయ్‌కుమార్, జితేంద్ర, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నియంత్రికల వద్ద ఎర్త్ పైపులకు నీరు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండి కల్లూరు విద్యుత్ ఉపకేంద్రముల పరిధిలో ఉన్న గ్రామాలలో నియంత్రికల వద్ద ఎర్త్ పైపులకు నీరు పోసి విద్యుత్తు తగ్గులు ఎలాంటి అంతరాయం లేకుండా మండే వేసవికి నీటిని పోసి విద్యుత్ సరఫరాను వినియోగదారులకు అందిస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి అబ్దుల్ ఆసిఫ్ తెలిపారు. ఉపకేంద్రం పరిధిలోని యజ్ఞ నారాయణపురం, చెన్నూరు, పెద్ద కోరుకొండి, వెన్నవల్లి, చిన్న కోరుకొండి, మర్లపాడు, టి వెంకటాపురం, అదేవిధంగా బత్తులపల్లి, కప్పల బంధం, పేరువంచ తదితర గ్రామాలలో నియంత్రికల వద్ద హెచ్చుతగ్గుల విద్యుత్తును అదుపులో ఉంచుకునేందుకు వేసవిలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ అధికారి మహేంద్ర కుమార్ తెలిపారు. ప్రతిరోజు కొన్ని గ్రామాలలో సిబ్బంది సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పెద్ద కోరుకొండి, కల్లూరు, విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. భూమి సారవంతంగా ఉండి నేల తడిగా చేస్తున్నామని ఆ సమయంలో విద్యుత్ సరఫరా కు ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. మార్చి, ఏప్రిల్, మే ఈ మూడు నెలల పాటు ఈ కార్యక్రమాన్ని నియంత్రికల వద్ద ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. సమీపంలోని ప్రజల సహకారం గ్రామపంచాయతీ సర్పంచుల సహకారం తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు వివరించారు. విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా నిరంతరం అందుబాటులో ఉండి విద్యుత్ సరఫరాకు హెచ్చుతగ్గులు లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

# మినీ ప్లీనరీకి తరలిన బిఆర్‌ఎస్ శ్రేణులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో నిర్వహించిన బిఆర్‌ఎస్ పార్టీ మినీ ప్లీనరీకి రఘునాథపాలెం మండలం నుంచి బిఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఆదివారం ఖమ్మం మమత ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన బిఆర్‌ఎస్ పార్టీ మినీ ప్లీనరీకి రఘునాథపాలెం మండలం నుంచి బిఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు బస్సులు, ప్రత్యేక వాహనాల్లో ఖమ్మం తరలి వెళ్లారు.

# సత్తుపల్లిలో 'ప్యూర్ జల్ ప్రో' ఆల్కలైన్ ఎలక్ట్రోలైట్ డ్రింక్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ప్యూర్ జల్ ప్రో అనే ఆల్కలైన్ వాటర్ ఆధారిత ఎలక్ట్రోలైట్ పానీయాన్ని సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా కమల్ పాషా ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. పట్టణంలో ప్రఖ్యాత గ్రాండ్ ఫర్నిచర్స్ అధినేత, కౌన్సిలర్ గ్రాండ్ మౌలాలి నేతృత్వంలో జలగం వెంగళరావు పార్క్ దగ్గర ఏర్పాటు చేసిన ప్లాంట్ ను చైర్మన్, వైస్ చైర్మన్లు సంయుక్తంగా ఆదివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, కౌన్సిలర్స్ సుజల రాణి, రాంబాబు, దేవి శ్రీను, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, వెంకట నారాయణ రెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# షరతులు లేకుండా కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/వైరాః** రైతులు పండించిన మొక్కజొన్న వరి ధాన్యాలను ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు. పంట చేతికొచ్చిన సమయంలో ప్రభుత్వం ఎకరానికి 26 క్వింటాల్ల మొక్కజొన్నలు కొంటామని మిగతా పంట గురించి మాకు సంబంధం లేదని, పట్టాదారు పాస్‌బుక్ రైతు వచ్చి తుమ్ము వేస్తేనే ఓటిపిలు వస్తాయని, అప్పుడే ధాన్యం మొక్కజొన్నలు కొంటామని షరతులు ప్రభుత్వం విధించడం సరైంది కాదు, కౌలుకు తీసుకొని పంటను పండించి చేతికొచ్చిన సమయంలో పట్టాదార్ రైతు వస్తేనే కొంటామని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని అన్నారు. ప్రభుత్వం షరతులు ఎత్తివేయకపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని గోపాలరావు తెలిపారు.

# ప్రతీ రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి : కలెక్టర్



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లాలోని ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పని సరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఆదివారం వ్యవసాయ శాఖ ఏడిఏలు, ఏఓలు, ఏఇఓలు, మీ సేవా కేంద్రాల మేనేజర్లతో గూగుల్ మీట్ ద్వారా ఫార్మర్ రిజిష్ట్రేషన్‌పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆధార్ ద్వారా దేశంలో ప్రతీ పౌరునికి గుర్తింపు కల్పించినట్లుగానే ప్రతీ రైతుకు 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడి) కేటాయించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చోస్తోందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు ఆయన తెలిపారు. భూమి గల ప్రతీ రైతుకు సంబంధించిన భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీ రూపొందించబడుతుందని చెప్పారు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ రికార్డులను ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసి ఫార్మర్ ఐడి జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇలా నమోదు చేయడంద్వారా ఎటువంటి కొత్త చట్టబద్ధ యాజమాన్య హక్కులు కల్పించబడవని, స్పష్టం చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న భూముల వివరాలను ప్రామాణికంగా తీసుకుని రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను అందించడానికి మాత్రమే ఉపయోగపడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమల్లో భాగంగా ఫార్మర్ రిజిష్ట్రేషన్‌ను అనుసంధానం చేయడం జరుగుతుందని, ప్రధానంగా పిఎం కిసాన్ పథకం తదుపరి విడతల లబ్ది పొందాలంటే ఫార్మర్ రిజిష్ట్రేలో నమోదు తప్పని సరిగా ఉండాలనే మార్గదర్శకాలను కేంద్రం జారీ చేసిందని తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నెంబర్ తో సమీపంలోని వ్యవసాయాధికారి, విస్తరణాధికారిని సంప్రదించాలని, లేక సమీప మీ సేవా కేంద్రాలను సంప్రదించి వెంటనే ఫార్మర్ ఐడి నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారులు, మీసే కేంద్రాల వారు తమ పరిధిలోని ప్రతి రైతుకు అవగాహన కల్పించి, రిజిష్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** అక్రమంగా ఇసుకను తరలిస్తూ పంచాయితీ ఆదాయానికి గండి కొడుతూ అడ్డుకొన్న వారిపై దాడులకు దిగుతూ, సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని నాగారం గ్రామ పంచాయితీ సర్పంచ్ దారవత్ స్వప్న అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ తీసుకొచ్చిన ఇసుక పాలసీకి విరుద్ధంగా ఇసుక రవాణా చేయటం నేరమన్నారు. గత ఆదివారం రోజున నాగారంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న కాటారపు యేసుకు చెందిన ట్రాక్టర్‌ను నిలిపివేయటం జరిగిందన్నారు. దీనితో ఆగ్రహానికి గురైన యేసు దుర్భాషలాడుతూ నా భర్తపై దాడికి పాల్పడ్డాడని చెప్పారు. దీనిపై స్థానిక పాత్రికేయుల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. వెంటనే స్పందించిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను అడ్డుకొని పోలీసులకు పట్టించినందుకు ట్రాక్టర్ యాజమాని యేసు కక్ష్య పెంచుకొని నాపై అబద్ధపు ప్రచారాలను, తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు. ఇదే కాక కొందరు అక్రమార్కులు ఓ పథకం ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇసుక రవాణా చేస్తున్నమని చెపుతూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తూ రహస్య ప్రదేశంలో డంపింగ్ చేసి అక్కడి నుండి ఇతర గ్రామాలకు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని దిగమింగుతున్నారని ఆరోపించారు. నాపై అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న కాటారపు యేసు చేస్తున్న తప్పుడు ఆరోపణలను వెంటనే మానుకోవాలని హెచ్చరించారు. లేని యెడల చట్ట పరమైన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నాగారం ప్రాంతంలో జరుగుతున్న అక్రమ ఇసుక రావాణాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంపటి రంజిత్, పొలగాని పవన్, దుర్గారావు, రాము, వెంకటేష్ పాల్గొన్నారు.





# బీరోలు పెద్ద చెరువు తూము ధ్వంసం

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఈ రమేశ్ రెడ్డి, ఎస్ఐ కూచిపూడి జగదీష్**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండల పరిధి లో బీరోలు గ్రామ పెద్ద చెరువు తూము (ఓ.టీ) ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గతంలో కాంక్రీట్ బెడ్ తో ఏర్పాటు చేసిన గేట్ లాక్ సెట్టర్ పనికి రాకుండా జేసీ బీతో పూర్తిగా ధ్వంసం చేసి చెరువు నీలల్లో పడి వేసి వెళ్లిపోయారు. దీంతో తూమ్ నుంచి భారీగా చెరువు నీరు వృధాగా బయటకు పోయింది. సమాచారం అందుకున్న ఇరిగేషన్ ఈ.ఈ, డీ.ఈ బాణాల రమేశ్ రెడ్డి, ఎస్సై కూచిపూడి జగదీశ్ ఘటనా స్థలానికి చేరుకోని పరిశీలించారు. ఎస్సై కూచిపూడి జగదీశ్ సమీప రైతులతో మాట్లాడి విచారణ చేపట్టగా. చెరువులో చేపలు పెట్టేందుకు నీళ్లు లేకుండా చేయాలని ఉద్దేశ పూర్వకంగా, చెరువు తూము ఓపెన్ చేసినట్లు అక్కడ రైతులు తెలిపినట్లు, ఈ మేరకు ముగ్గురు వ్యక్తులను అనుమానితులుగా పేర్కొంటూ ఆ శాఖ ఏ.ఈ రామకృష్ణ ఆదివారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతిని చెల్లించాలి : ఏఐవైఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతను వంచించడం మానుకోవాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు తక్షణమే ఉద్యోగాల భర్తీ చేపట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రం లోని కర్నాటి కృష్ణయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి నిరుద్యోగులకు ఆకాశమే హద్దుగా వాగ్దానాలు చేసి, గద్దెనెక్కిన తర్వాత వాటిని గాలికొదిలేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలోనూ, ప్రకటించిన విధంగా నిరుద్యోగ భృతిని అందించడంలోనూ పాలకులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. హక్కుల సాధన కోసం నిరుద్యోగ యువత అంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రభుత్వాలు ఇప్పటికైనా మొండి వైఖరి వీడాలని హితవు పలికారు. లేని పక్షంలో యువతను సంఘటితం చేసి ఉధృత పోరాటాలతో ప్రభుత్వాల మెడలు వంచుతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు బాలిన కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.


# అక్రమ ఇసుక టిప్పర్ల పట్టివేత



**ప్రజాపక్షం/పాల్వంచ :** నిభంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్‌లు, రెండు ట్రాక్టర్‌లను ఆదివారం పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండల పరిధి తోగ్గూడెం సమీపంలోని మొర్రేడు వాగు నుండి అక్రమంగా తరలిస్తున్నట్లుగా పక్కా సమాచారం మేరకు తహశీల్దార్ దారా ప్రసాద్ ఆదేశాలతో ఆర్ఐ.నలీన్ కుమార్, పంచాయితీ అధికారులు కలిసి మూడు టిప్పర్‌లను పట్టుకొన్నారు. పాత పాల్వంచ మొర్రేడు వాగు నుండి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పట్టణ ఎస్ఐ. నాగరాజు తన సిబ్బందితో కలిసి పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సంధర్భంగా అధికారులు మాట్లాడుతూ అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

# డిహెచ్‌పీఎస్ రాష్ట్ర మహాసభలు విజయవంతం

**-రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పేరాల శ్రీనివాసరావు**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** దళిత హక్కుల పోరాట సమితి(డిహెచ్‌పీఎస్)తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభలు ఏప్రిల్ 17,18 తేదీలలో వరంగల్‌లోని కామ్రేడ్ బండిల నరసయ్య హాల్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ మహాసభల్లో నూతన రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పినపాక నియోజకవర్గం నుండి పేరాల శ్రీనివాసరావు, జంగం మోహన్‌రావు ఎంపికయ్యారు. దీంతో నియోజకవర్గానికి ప్రాధాన్యత కలిగిన ప్రాతినిధ్యం లభించింది. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పేరాల శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో దళితులకు సామాజిక న్యాయం సాధించడం, కులవ్యవస్థ నిర్మూలన, దళిత ఐక్యతను బలోపేతం చేయడం తమ ముఖ్య లక్ష్యాలని పేర్కొన్నారు. అలాగే జనాభా నిష్పత్తి ప్రకారం ప్రభుత్వం, ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్లు సాధించి అమలు చేయడానికి కృషి చేస్తామని వెల్లడించారు. మహాసభలు దళిత హక్కుల సాధనలో కీలక దిశగా సాగాయని అభిప్రాయపడ్డారు.

# ఫెర్టిలైజర్స్ అసోషియేషన్ అధ్యక్షునిగా తిరుక్కొవళ్లూరి



**ప్రజాపక్షం/గుండాల :** మండల ఫెర్టిలైజర్స్,ఫెస్టిసైడ్స్ ,సీడ్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రైతువేదికనందు వ్యాపారులు సమావేశం నిర్వహించి అధ్యక్షునిగా తిరుక్కొవళ్ళూరి వెంకటేశ్వరస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రెటరీగా మానాల ప్రభాకర్, కోశాధికారిగా మాడె మంగయ్య, గౌరవ అధ్యక్షులుగా మానాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా చాట్ల సూర్యనారాయణ, బిచ్చాల వీరస్వామి, జాయింట్ సెక్రెటరిగా పెంటి వేణు, ఇసిగా పాయంనాగభూషణం, ఈసం రాజబాబులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

# వేటగాళ్లపై పోలీసులకు ఫిర్యాదు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ అటవీ శాఖ రేంజ్ పరిధిలో గల వెంకటియాతండా బీట్‌లో గత అర్ధ రాత్రి(శనివారం)అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలను అమర్చి అటవీ జంతువులను వేటాడుతున్నట్లు సమాచారం అందుకున్న అటవీ శాఖ రేంజర్ ఎల్లయ్య ఆధ్వర్యంలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. అడవిలో సంచరిస్తున్న వెంటియాతండా గ్రామస్తులు బానోతథ్ వీరన్న, ఇస్లావత్ సిత్తు, తేజావత్ రమేష్, బానోత్ సురేష్, బాదావత్ చిన్న, ఇస్లావత్ జామ్లాలను అదుపులోకి తీసుకున్నట్లు రేంజర్ ఎల్లయ్య ఆదివారం తెలిపారు. ఈ ఆరుగురు వ్యక్తులు గత కొంతకాలంగా అటవీ ప్రాంతంలో జంతువులను వేటాడేందుకు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలను అమర్చి ఉన్న వాటిని తొలగించి, జంతువులను వేటాడకుండా చేశామన్నారు. అటవీ జంతువులను వేటాడేందుకు ఆరుగురు వ్యక్తులు ప్రయత్నించిన నేపథ్యంలో వీరిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సైతం అటవీ శాఖ తరుపున బీట్ అధికారి రవి ఫిర్యాదు చేసి, ఈ ఆరుగురు వ్యక్తులను పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. అటవీ ప్రాంతంలో చట్టవ్యతిరేకంగా విద్యుత్ తీగలను అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ జంతువులను చంపటం చేసిన వారి ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను సైతం రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని తెలిపారు.

# చెరువులో స్నానానికి దిగిన విద్యార్థి గల్లంతు



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు లో విజ్ఞాన పాఠశాలలో చదువుకుంటున్న బొర్రా శశిధర్ (14), పివి కాలనీ, పేరూరి గిరిధర్ (14), అశ్వాపురం మండలం హర్షవర్ధన్ (14) ఆదర్శనగర్ మణుగూరు అను ముగ్గురు విద్యార్థులు పాఠశాల ముగిసిన అనంతరం రేగుల గండి చెరువులో స్నానానికి దిగారు. ముగ్గురిలో ఒకరైన హర్షవర్ధన్ చెరువులో గల్లంతయ్యాడు. సంఘటన స్థలానికి చేరుకున్న సిఐ నాగబాబు గాలింపు చర్యలు చేపట్టారు.



# లారీ డ్రైవర్లతో రైతులకు తప్పని ఇక్కట్లు

- బస్తాకు రూ.5 ఇస్తేనే ఎగుమతి చేస్తామని డిమాండ్
- లేకుంటే ఐదు రోజులైనా బస్తాలు వెళ్లేది లేదు
- రైతులు నిరాకరించటంతో నిలిచిన ఎగుమతులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతులను లారీ డ్రైవర్లు ఇబ్బందులు పెడుతున్నారు. అడిగినంత ఇవ్వకుంటే లారీల ఎగుమతులు చేయటం లేదని రైతులు వాపోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని మోటాపురం లో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లో రైతుల గోడు ను పట్టించుకునే వారే కరువయ్యారు. కాంటా వేసిన బస్తాలను ఎగుమతి చేసేందుకు లారీ డ్రైవర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. అవసరం ను బట్టి రూ.4 నుంచి రూ.5 వరకు ఇస్తేనే ఎగుమతులు చేస్తామని డిమాండ్ చేస్తున్నారు. దీంతో రైతులు వేలాది రూపాయాలు నష్టపోతున్నారు. ఇబ్బందులు పడ లేక కొంత మంది రైతులు రూ.2 లను ఇచ్చి ఎగుమతులు చేయించుకుంటున్నారని పలువురు రైతులు పేర్కోంటున్నారు. మిల్లుల వద్ద లారీ దిగుమతుల కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నామని, ఆ నష్టం ను రైతులే డబ్బులు ఇవ్వాల్సిందేనని రైతుల వద్ద నుంచి బలవంతంగా వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజుల నుంచి లారీలు రాకపోవటంతో ఎక్కడిబస్తాలు అక్కడే మూలుగుతున్నాయి. కేంద్రం పై పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తిన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. రైతులు డబ్బులు ఇవ్వటం లేదు కాబట్టే రావటం లేదని రైతులు ఆరోపిస్తుండుగా, మిల్లుల వద్ద దిగుమతులు ఆలస్యం అవుతుందని అందుకే రావటం లేదని నిర్వహాకులు తెలుపుతున్నారు. ఆరుగాలం పండించిన పంట విక్రయం కు వచ్చే సరికి అమ్ముకున్న మొక్కజొన్న ను ఎగుమతులు చేసుకోలేకపోతున్నామని రైతులు అగ్రహాం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల ఇబ్బందులను పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయం పై సోసైటీ కార్యదర్శి రంగా రావు ను వివరణ కోరగా, డ్రైవర్లు బలవంతం చేయటం లేదని, ఇష్టమైన వారు ఇస్తే మాకు సంబంధం లేదన్నారు. డ్రైవర్లు డబ్బులు డిమాండ్ చేస్తే సహించమని పేర్కొన్నారు. లారీలు రానీ మాట వాస్తవం అన్నారు.

## ఒరిగిన స్తంభం సరిచేసేదెన్నడో..!?

**ప్రజాపక్షం/సుజాతనగర్ :** సుజాతనగర్ పరిధిలోని హరిజనవాడ గ్రామంలో పురాతన కాలంలో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని ప్రజలకు ప్రాణహాని ముప్పుగా మారాయి. ముఖ్యంగా ఒక స్తంభం పూర్తిగా ఒరిగి ప్రమాదకరంగా నిలిచి ఉండటం గ్రామస్తులను భయాందోళనలకు గురిచేస్తోంది. గ్రామంలో సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఈ ఇనుప స్తంభాలు కాలక్రమేణా బలహీనమై ఇప్పుడు కూలిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఈ సమస్యను పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో సమీప గ్రామాల్లో ఇలాంటి పాత ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేసిన అధికారులు, హరిజనవాడ విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. “మా గ్రామం మీదే ఎందుకు వివక్షత?” అంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఒరిగి ఉన్న స్తంభం ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా రాబోయే ఎండాకాలంలో బలమైన ఈదురు గాలులు వీస్తే ఈ స్తంభం నేలకూలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వారు చెబుతున్నారు. అలా జరిగితే ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు ఆడుకునే ప్రదేశం, ప్రజలు తరచూ వెళ్లే మార్గం దగ్గర ఈ స్తంభం ఉండటం మరింత ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు భయంతో గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు సంబంధిత శాఖ అధికారులను వెంటనే స్పందించి ఒరిగిన స్తంభాన్ని తొలగించి కొత్త సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే గ్రామంలోని అన్ని పాత ఇనుప స్తంభాలను కూడా పరిశీలించి అవసరమైతే మార్పిడి చేయాలని కోరుతున్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ సమస్యపై దృష్టి సారించి అధికారులతో సమన్వయం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను నిర్లక్ష్యం చేయడం వల్ల పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవడం అత్యవసరం. సుజాతనగర్ హరిజనవాడలో ఒరిగిన స్తంభం సమస్య కేవలం ఒక నిర్మాణ సమస్య మాత్రమే కాదు ఇది ప్రజల ప్రాణాలకు సంబంధించిన అత్యవసర అంశం. అధికారులు ఇప్పటికైనా మేల్కొని వెంటనే చర్యలు తీసుకుంటేనే పెద్ద ప్రమాదాన్ని నివారించవచ్చు.



## వడదెబ్బతో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలం నాగిలిగొండకు చెందిన వ్యవసాయ కూలీ షేక్ మీరా(42) వడదెబ్బకు గురై ఆదివారం మృతిచెందాడు. గత మూడు రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఆదివారం మొక్కజొన్నలు ఆరబోసేందుకు వెళ్ళి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికంగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, నాయకులు హుస్సేన్, ఏపూరి నర్సయ్య , ఏలియా, బాబు, శేషగిరి సందర్శించి నివాళులర్పించారు.



## ఘనంగా మాజీ మంత్రి పువ్వాడ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదిన సందర్భంగా మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా పుట్టినరోజు కేక్‌ను కట్ చేసి పువ్వాడ అజయ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఖమ్మం మమత ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన బిఆర్ఎస్ పార్టీ మినీ ప్లీనరీకి గుత్తా రవి ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు ప్రత్యేక వాహనాల ద్వారా తరలి వెళ్లారు.



## జాతీయస్థాయి టేబుట్ టెన్నిస్ పోటీలకు ఆరెంపుల విద్యార్థి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెంపుల గ్రామానికి చెందిన మేడిద అనంతరెడ్డి, లలిత దంపతుల పెద్ద కుమారుడు మేడిద రణధీర్‌రెడ్డి జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు అర్హత సాధించాడు. డెహ్రాడూన్‌లో ఈ నెల 20నుండి23వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు, పలు రాజకీయపార్టీల నాయకులు, కుటుంబ సభ్యులు రణధీర్‌రెడ్డిని అభినందించారు. పోటీలలో మంచి ప్రతిభ కబరచి విజయం సాధించి గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



## శ్రీ వెంకటేశ్వర సూపర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** బీరోలు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ హుజూర్నగర్ కోదాడ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బత్తిని జగన్మోహన్ రావు డాక్టర్లు ఎమ్మెస్ సర్జన్ శివప్రసాద్ డాక్టర్ సాయికుమార్ ఎండి జనరల్ మెడిసిన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దేవ బిక్షం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఉదయం 9 గంటలకి ప్రారంభమైన వైద్య శిబిరం సాయంత్రం ఐదు గంటల వరకు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు బబీరోలు గ్రామ ప్రజలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకొని ఔషధాలు పొందారు. సుమారు 350 మంది ప్రజల వైద్య సేవలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు వారికి సుమారు రెండు లక్షల 50 వేల రూపాయల విలువైన ఔషధాలు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ స్టాఫ్ నర్స్ గ్రామ పెద్దలు గుండా రఘురాం రెడ్డి, మెంబర్లు మిర్యాల విక్రమ్ రెడ్డి, పుల్లారెడ్డి, బత్తిని జగన్మోహన్ రావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణంలో నాసిరకం పనులు

- ప్రభుత్వ నిధులతో నిర్మాణం కొనసాగుతున్న పిహెచ్‌సి
- నాసిరకం ఇసుక, సిమెంట్ వినియోగం ఆరోపణలు
- నిర్మాణ దశలోనే బలహీనతలు బయటపడుతున్న పరిస్థితి
- అధికారులపై గ్రామస్తుల తీవ్ర అసంతృప్తి
- విచారణకు అధికారులు

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ఆసుపత్రే ఇప్పుడు ప్రాణాలకు ముప్పుగా మారుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 13లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పూర్తిగా విస్మరించబడ్డాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పారుతున్న వాగులో ఉన్న నాసిరకం ఇసుకను పునాదుల నుండి పూర్తిగా నిర్మాణం అంత వరకు పెద్ద మొత్తంలో ఇసుకను సేకరించారని దీనినే వాడుతున్నారని, తక్కువ గ్రేడ్ సిమెంట్ వాడటం వల్ల భవనం గోడలు ఇప్పటికే పగుళ్లు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇంకా నిర్మాణం పూర్తికాకముందే ఈ పరిస్థితి తలెత్తడం మరింత ఆందోళన కలిగిస్తోంది. బలమైన పటిష్టమైన ఇటుకలను వినియోగించకుండా ఫ్లైయాస్ బ్రిక్స్‌ను తీసుకొచ్చి ఇష్టారాజ్యంగా నిర్మాణం చేస్తున్నారని ఇదేమిటని ప్రశ్నిస్తేత మీ దిక్కునచోట చెప్పుకోండి అంటూ గుత్తేదారు సమాధానం చెబుతున్నాడని, ఇది ఆసుపత్రి కాదు, ప్రమాద భవనం, రేపు ఎవరి ప్రాణాలు పోతాయో చెప్పలేం అంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నిర్మాణం ఇలాగే కొనసాగితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారి పంచాయితీ రాజ్ శాఖ ఏఈ శ్రీనివాస్‌ను ప్రజాపక్షం ప్రశ్నించగా వారు స్పందిస్తూ, పనుల నాణ్యతపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని, లోపాలను సరిచేసి నిర్మాణం జరిగేలా చేస్తామని, గుత్తేదారు వినకపోతే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అయితే గ్రామస్తులు మాత్రం వెంటనే పనులను నిలిపివేసి, నాణ్యత ప్రమాణాలతో మళ్లీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన విషయంలో ఇలాంటి నిర్లక్ష్యం క్షమించబోమని హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా ప్పటికీ గుత్తేదారులు ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాల మేరకు నిర్మాణం చేయడం మంచిదని లేకుంటే దాని పర్యవసానం ప్రజల మీద పడుతుందని గ్రామ ప్రజలు, పెద్దలు, రాజకీయ నాయకులు తెలియజేస్తున్నారు.

